

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ



అభీ న జావో ప్రాణ్! ప్రాణ్ మే ప్యాస్ శేష్ హై!

ప్యాస్ శేష్ హై!

సినిమాలకు పాటలు రాయకపోయి ఉంటే కవి నీరజ్ గోపాల్ దాస్, నీరజ్ గోపాల్ దాస్ గానే మిగిలి ఉండేవాడు. హిందీ కవితా ప్రపంచ నీరాజనాలు మాత్రం అందుకుని ఉండేవాడు. కానీ అనుకోని పరిస్థితులలో నీరజ్ గోపాల్ దాస్ హిందీ సినీ గేయ ప్రపంచంలో అడిగిడాడు. అతి తక్కువ కాలం మాత్రమే సినీ ప్రపంచంలో గీతాలు రాశాడు. ఆయన రాసిన గీతాల సంఖ్య దాదాపుగా వంద మాత్రమే. కానీ 'నీరజ్'గా దేశ వ్యాప్తంగా ప్రజలకు పరిచయమయ్యాడు. ఆయన పాటలు ప్రజల నాల్కలపై ఈ నాటికీ నృత్యం చేస్తున్నాయి. ఆయన పాటల భావాలు ఈనాటికీ ప్రజల గుండెలలో ఆనంద తాండవం చేస్తున్నాయి. మనసులను మురిపిస్తున్నాయి. ఈ వంద సినిమా పాటలు హిందీ సినీ గేయ ప్రపంచంలో ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించటమే కాదు 'నీరజ్'గోపాలదాస్‌ను 'నీరజ్'గా చిరంజీవిని చేశాయి. కానీ హిందీ సినీ ప్రపంచంలో పేరు ప్రఖ్యాతులు సాధించినా, గౌరవ మన్ననలందుకున్నా నీరజ్ ఏనాడూ సినీకవిగా సంతోషంగా లేడు.

తమాం ఉమ్ర్ మై ఎక్ అజ్నబీ కే ఘర్ మే రహా!

సఫర్ న కర్ తే హువే భీ, కిసీ సఫర్ మే రహా!

జీవితాంతం నేను అపరిచితుడి ఇంట్లో ఉన్నాను.

ప్రయాణం చేయకుండా కూడా ఏదో ప్రయాణంలోనే ఉన్నాను.

అత్యద్భుతము, అతి సున్నితము, తాత్వికమూ అయిన కవితలు అతి సరళంగా, సుందరంగా అతి సులువైన పదాలతో, ప్రతీకలతో వ్యక్తం చేయటం నీరజ్‌కు వెన్నతో పెట్టిన విద్య.

జబ్ భీ ఇస్ షహర్‌మే కమ్రే సే మై బాహర్ నిక్‌లా

మేరే స్వాగత్ కో హర్ ఏక్ జేబ్ సే ఖంజర్ నిక్‌లా!

ఈ నగరంలో నేను ఇంట్లోంచి ఎప్పుడు బయటకు అడుగు పెటినా నన్ను స్వాగతిస్తూ ప్రతి ఒక్కరి జేబులోంచి కత్తులు బయటకు వచ్చాయి.

గమనిస్తే, తన రచనల్లో అత్యంత తీవ్రమైన వేదనను కలిగించే విషయాలను సైతం అత్యంత చమత్కారంగా, తేలికగా చెప్పటం నీరజ్‌కు అలవాటు. పెదవులపై చిరునవ్వు, కన్నుల్లో కదిలే కన్నీరు హృదయంలో తుఫాను, పెదవులపై గానంలా నీరజ్ కవితలు మనసును కదిలిస్తాయి. హత్తుకుపోతాయి. జీవితాంతం కరగని, చెదరని మధుర స్మృతుల్లా మిగిలిపోతాయి.

తబ్ మానవ్ కవీ బన్ జాతాహై

జబ్ ఉస్‌కో సంసార్ రులాతా

వహ అప్నోంకె సమీప్ జాతా,

ఏక్ జబ్ వే భీ ఠుక్ రా దేతె,

వహ నిజమన్ కె సమ్ముఖ్ ఆతా,

దేఖ్ ఉస్ కీ దుర్బలతా జబ్ మన్ భీ ఉస్కా ముస్కాతాహై.

తబ్ మానవ్ కవీ బన్ జాతా!

ఒక మాములు మనిషి కవిగా ఎప్పుడు రూపాంతరం చెందుతాడంటే, ప్రపంచం అతడిని ఏడ్పించినప్పుడు, అతడి ఆశలను నిరాశలు చేసి అణచివేసినప్పుడు. అప్పుడు వ్యక్తి తన వారి దగ్గరకు వెళ్తాడు. వారూ అతడిని తిరస్కరించినప్పుడు వ్యక్తి అంతర్ముఖుడవుతాడు. తనలోకి తాను చూసుకుంటాడు. అయితే, ఎప్పుడయితే, అతని మనస్సు అతని దుర్భలత్వం, బలహీనతలు, మూర్ఖత్వం చూసి నవ్వుతుందో, అప్పుడతడు 'కవి' అవుతాడు. అలాంటి పరిస్థితులలో సామాన్యమానవుడు 'కవి' అవుతాడు. ఒక వ్యక్తి కవి అవటంలోని వేదన, సున్నితత్వం, తపస్సులను అత్యంత సులభంగా, సరళంగా ప్రదర్శిస్తుంది నీరజ్ కవిత.

నీరజ్ కవితలలో గమనించాల్సిన ప్రధాన అంశం పదాల వాడకం. శుద్ధ హిందీ పదాలను, అవీ స్వచ్ఛమూ, సరళమూ అయిన పదాలను అలవోకగా వాడతాడు. కానీ ఆ తేలికగా కనిపించే పదాలలో సముద్రమంతటి భావాన్ని, వేదనను పొదుగుతాడు.

**జిత్ నా కం సామాన్ రహేగా**

**ఉత్ నా సఫర్ ఆసాన్ రహేగా**

సామాన్లు ఎంత తక్కువ ఉంటే ప్రయాణం అంత సులభం. అందరికీ సులభంగా అర్థమవుతుంది. ప్రయాణాలు తరచూ చేసేవారికి ఈ మాటలలోని సత్యం అనుభవమే. కానీ నీరజ్ ప్రస్తావిస్తున్నది మాములు ప్రయాణం కాదు.

**జిత్ నీ భారి గఠరీ హోగీ**

**ఉత్నా తూ హైరాన్ రహేగా**

మానవ శరీరాన్ని తోలు సంచితో పోలుస్తారు. ఈ శరీరం ఎంత ఖరీదయితే అన్ని సమస్యలుంటాయి. ఇక్కడ శరీరం భారీ అన్నది పరిమాణం విషయానికి సంబంధించినది కాదు. ఇది మనిషి జీవనానికి సంబంధించినది. బంధాలకు, భౌతిక సుఖలాలసకు సంబంధించినది.

**ఉస్ సే మిల్ నా నా ముంకిన్ హై**

**జబ్ తక్ ఖుద్ కా ధ్యాన్ రహేగా**

తనను గురించిన ఆలోచన మాత్రమే ఉన్నంతకాలం అతడిని కలవటం అసంభవం రెండువైపుల పదునైన కత్తిలాంటి భావం. వ్యక్తి తన నిత్యావసరాలు, జీవన పోరాటం మునిగి ఉన్నంత వరకూ 'అతడి'ని ఎలా కలవగలుగుతాడు? అసలు దృష్టి ఆ వైపుకు పోతుందా? అంతేకాదు, తనమీదే దృష్టి ఉన్నవాడిలోని అసలు మనిషిని కలవగలుగుతామా? అన్న భావం ఈ వాక్యాలతో ఇమిడి ఉంది.

**నీరజ్ కల్ యహాన హోగా**

**ఉస్ కా గీత్ విధాన్ రహేగా.**

నీరజ్ రేపు ఇక్కడ ఉండడు. కానీ గీత రచన సంవిధానం చిరకాలం నిలచి ఉంటుంది.

ప్రతి కళాకారుడికి తన సృజన విలువ పట్ల అవగాహన ఉంటుంది. తన సృజన ప్రజలను కదలిస్తుందనీ, తరతరాలుగా నిలుస్తుందన్న విశ్వాసం ఉన్న కవి మాత్రమే ఇలా రాయగలడు.

**జబ్ చలే జాయేంగె లౌట్కే సావన్ కీ తరహా!**

**యాద్ ఆయేంగె ప్రథం ప్యార్‌కే చుంబన్ కీ తరహా!**

అద్భుతం! తన కవిత ప్రభావం తెలిసిన కవి హృదయం మాత్రమే ఇలాంటి భావాన్ని ఇంత సుందరంగా, నిర్ద్వంద్వంగా వ్యక్త పరచగలదు.

వర్ష ఋతువులా వచ్చి వెళ్లిపోయినప్పుడు తొలి ప్రేమలో తొలి చుంబనంలా గుర్తుకు వస్తూనే ఉంటాను.

అయితే కవికి కవి హృదయాన్ని అర్థం చేసుకునే శ్రోత కావాలి. సున్నిత హృదయం కావాలి. 'శ్రోతల తలలూగిపోయే కవిత చెప్పగలను. కానీ తల ఉన్న మనిషి ఉండాలి కదా!' అన్నాడో కవి. అలా కవితను అర్థం చేసుకోలేని వారి నడుమ కవితను వినిపించటం అంటే గుడ్డివాడికి దీపం చూపినట్టు. చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్టు.

**జిస్మే ఇన్సాన్‌కే దిల్ కే న హో థడ్ కన్ కీ 'నీరజ్'**

**షాయరీతో హై వహ అఖ్బార్ కీ కతరన్‌కీ తరహ్!**

ఎవరి హృదయంలో సుమదళంలాంటి స్పందన ఉండదో, అలాంటి వారికి కవిత, వార్తా పత్రికలలో వార్తలాంటిది.

శ్రోతల గురించి, కవితలను అర్థం చేసుకుని, అనుభవించేందుకు అవసరమైన సున్నిత హృదయం లేకపోతే కవిత బండమీద నుండి జాలువారే వర్షాధారలాంటిదని తెలిసిన నీరజ్ సినీ గేయరచన కోసమని హిందీ సినీగేయ ప్రపంచంలో అడుగిడినప్పుడు అతడు ఎక్కువ కాలం ఈ రంగంలో మనలేడని అందరూ అభిప్రాయపడ్డారు. సినీ రంగంలో గేయరచయితలకు అంతగా విలువ ఉండదు. ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందితే తప్పించి సరైన గౌరవం దొరకదు. అలాంటి రంగంలో 'గొప్ప కవి'గా పేరు ప్రఖ్యాతులు పొందిన 'నీరజ్' అడుగిడుతూంటే, ఆయన ఈ రంగంలో ఎక్కువ కాలం నిలవలేడనీ అందరూ ఊహించారు. సినీ గేయ ప్రపంచంలో సంగీత దర్శకుడిది పైచేయి. బాణీకి ప్రాధాన్యం. గేయరచన వేరు కవిత్వం వేరు. కవిత్వ రచనలో ఉన్న స్వేచ్ఛ గేయ రచనలో ఉండదు. కవి స్పందించినప్పుడు కవి హృదయం కవితను ప్రసవిస్తుంది. అది తనదైన ప్రత్యేక లయతో, భావంతో ఉద్భవిస్తుంది. కాని సినిమా పాట అలాకాదు.

సినిమా పాటకు పరిమితులు అనేకం. గేయ రచయిత పై ప్రతిబంధనాలు అనేకం. గమనిస్తే, సినిమా పాటలో అన్ని పరిమితులకు ఒదగాల్సింది గేయ రచయితనే. గాయకుడికి పాటను బాణీ పరిధిలో ఇష్టం వచ్చినట్టు పాడే వీలుంటుంది. స్వేచ్ఛ అంతా సంగీత దర్శకుడిదే. అందుకే, 'నయా ఉమర్ కీ నయా ఫసల్' (1965) సినిమాకు నీరజ్‌ను గేయ రచయితగా ఎంచుకోవటం పట్ల ఎందరో పెదవి విరిచారు. 'కవిగా గొప్పవాడు కావచ్చు. కానీ సినిమా పాటల రచన వేరు.' అని వ్యాఖ్యానించారు. ఇందుకు వారు ఎంతో పేరు ప్రఖ్యాతులు కవిగా సంపాదించిన కైఫీ ఆజ్మీని ఉదాహరణగా చూపారు. ఎంతో పేరు ప్రఖ్యాతులు కవిగా సంపాదించిన కైఫీ ఆజ్మీ గేయ రచయితగా నిలదొక్కుకోలేకపోయాడు.

అయితే 'నయా ఉమర్ కీ నయా ఫసల్' సినిమాకు నీరజ్‌ను గేయ రచయితగా ఎంపిక చేసుకోవటమే గమ్మత్తుగా జరిగింది. సంగీత దర్శకుడు రోషన్, సాహిర్ లూధియాన్వీతో కలసి అత్యద్భుతమైన పాటలను సృజిస్తున్నాడు. కాని ఈ సినిమా తక్కువ బడ్జెట్ సినిమా. ఫిల్మ్ డివిజన్ నిర్మాణం కావటంతో గవర్నమెంట్ రేట్లే ఇస్తారు. సాహిర్ ఒక్క పైసా తక్కువయినా ఒప్పుకోడు. శైలేంద్ర అత్యద్భుతమైన గేయ రచయిత. కానీ అతను శంకర్ జై కిషన్, ఎస్డీ బర్మన్ వంటి అగ్రశ్రేణి సంగీత దర్శకులతో పనిచేస్తూ బిజీగా ఉన్నాడు అదే సమయానికి అతను స్వయంగా నిర్మిస్తున్న సినిమా 'తీస్రీ కసం' నిర్మాణం చివరి దశలో ఉంది. దాంతో ఈ సినిమాకు పాటలు రాసే తీరిక అతనికి లేదు. ఇలాంటి పరిస్థితిలో 'నయా ఉమర్ కీ నయా ఫసల్ ' సినిమా లక్ష్యాన్ని ప్రతిబింబించే కవిత 'స్వప్న్ ఝరే ఫూల్ సే'ను రచించిన నీరజ్ తోనే పాటలు

రాయిస్తే బాగుంటుందన్న ఆలోచన వచ్చింది. నీరజ్ కూడా పాటలు రచించటానికి సుముఖంగా ఉండటంతో నీరజ్ సినీ ప్రపంచంలోకి అడుగిడాడు. అందరూ ఊహించినట్టు ఎక్కువ కాలం సినీరంగంలో నిలవకపోయినా చిరకాలం నిలిచే మధురమైన గేయాలను సృజించాడు.

నీరజ్ మనస్సు ఏనాడూ సినీ రంగంపై స్థిరపడలేదు. అతడి మనస్సు, దృష్టి అంతా 'అలీఘడ్' పైనే కేంద్రీకృతమై ఉంది. బొంబాయికి ఎప్పుడు వచ్చినా అతిథిగానే వచ్చాడు తప్ప స్థిరపడాలని ప్రయత్నించలేదు. ఎందుకంటే, నీరజ్ కు సినీ ప్రపంచం తనది కాదని తెలుసు.

'తమాం ఉమ్ర మై అజ్ నబీ కీ ఘర్ మే రహా' అని భావించిన వ్యక్తి తన ఇంట్లో కూడా ప్రశాంతంగా ఉండలేదు.

నీరజ్ కవితల్లాగే గేయ రచన సంవిధానం కూడా విలక్షణమైనది. ఆయన సినీ కవులకు అలవాటయిన పదాలు వాడడు. అలవాటయిన రీతిలో రచించడు. ఇది ఆయన తొలి సినిమాలోని పాటలు స్పష్టం చేస్తాయి. అద్దం ముందు నుంచుని తనని తాను చూసి మురుస్తున్న నాయికను చూసి నాయకుడు ,

దేఖ్ తీ హీ రహో ఆజ్ దర్పణ్ న తుం
ప్యార్ కా యే మహురత్ నికల్ జాయెగా

అంటాడు. 'అద్దం ముందు నిలబడి నిన్ను నువ్వే చూస్తూ మురుస్తుంటే, ప్రేమ ముహూర్తం మించిపోతుంది' అంటున్నాడు నాయకుడు. ఈ పాటలో నీరజ్ వాడిన ప్రతీకలు, పొదిగిన భావాలు, వాడిన పదాలు సినీగీతాలలో అరుదుగానైనా వినబడవు.

సాస్‌కీతో బహుత్ తేజ్ రఫ్తార్ హై
ఔర్ ఛోటీ బహుత్ హై మిలన్ కీ ఘడీ
గూంధతే గూంధతే ఘటా సావరి
బుఝ్ న జాయే కహీ రూప్ కీ ఫుల్ ఝుడీ
చూడియా హీ న తుం ఖనఖనాతీ రహో
యే షరం సార్ మౌసం బదల్ జాయెగా..

ఊపిరి వేగం అధికం. ప్రేమకు సమయం పరిమితం. అంటే కాలం పరుగిడుతోంది కాబట్టి అద్దం ముందు సమయం వ్యర్థం చేయకు అంటున్నాడు నాయకుడు. ఎలాగయితే ఉరిమి ఉరిమి మేఘం అలసిపోతుందో, అలా తళుకు బెళుకుల రూపం తరిగిపోతుంది. ఈ విషయాన్ని చెప్పటం కోసం కవి, 'రూప్ కీ ఫుల్ ఝుడీ' అన్న పదం వాడాడు. 'ఫుల్ ఝుడీ ' అంటే చిచ్చుబుడ్డి. చిచ్చుబుడ్డి క్షణికం. ఆ క్షణికంలో మెరుపులు మెరుస్తుంది. నక్షత్రాల విరిజల్లు కురిపిస్తుంది. కానీ అదంతా కొద్దిసేపే. కాబట్టి అద్దం ముందు సమయం వ్యర్థం చేయకు అంటున్నాడు నాయకుడు.

సుర్ఖ్ హోటోం పె ఉఫ్ యె హసీ మదభరీ
జైసె షబ్నం అంగారోం కి మెహమాన్ హో

ఆమె పెదిమలపై నవ్వు ఎంత అద్భుతంగా ఉందంటే తుషార బిందువు నిప్పు కణికల అతిథి అయినంత గొప్పగా ఉందట! ఏమి పోలిక! ఎంత అత్యద్భుతమైన భావం! ఇంకా ఈ పాటలో మహావర్ ' 'ఫర్ష్ కా మర్మరీ' వంటి పదాలను వాడేడు. 'మహావర్' అంటే పారాణి.. పాదాలపై పారాణి అంతగా రచింపకు, తన, నాజూకు హృదయం చలించిపోతుంది అంటాడు. పాట చివరలో అంటాడు,

న న పల్లు ఉఠావో
న న పల్లు ఉఠావో, గిరావో నహీ

షాయరీక నయా దౌర్ చల్ జాయేగా

ఆమె కొంగు ఎత్తి జార్చటంలో కవిత్వంలో కొత్త మార్గం ఉద్భవిస్తోందట. ఇలాంటి చమత్కారమైన, శృంగార కవితాత్మక గేయ రచనతో నీరజ్ అందరినీ అలరించాడు.

ఈ సినిమాలోనే నాయకుడు నాయిక కోసం ఎదురు చూస్తూ ఓ పాట పాడతాడు.

**ఆజ్ కీ రాత్ బడీ షోఖ్ బడీ నట్ ఖట్ హై**

**ఆజ్‌తో తేరేబినా నీంద్ నహీ ఆయేగీ**

సినిమాలో ఈ పాట రెండు సందర్భాలలో వస్తుంది. నాయకుడు నాయిక కోసం ఎదురుచూస్తూ ఓసారి పాడతాడు. రెండోసారి నాయిక నాయకుడి కోసం ఎదురుచూస్తూ పాడుతుంది. ఆ పాట విన్న నాయకుడు పేద ప్రజల జీవితాలలో వెలుగులు నింపే వరకూ తన జీవితంలో ప్రేమ గురించిన ఆలోచన లేదని పాడతాడు. ఈ పాట మొత్తం ఓ అద్భుతమైన కవితలా ఉంటుంది.

నాయకుడు నాయిక కోసం ఎదురుచూస్తూ పాడే సందర్భంలో కవి ఆ వాతావరణాన్ని నాయకుడి భావనలను, ప్రకృతిని పరవశించి వర్ణిస్తాడు. అది చదువుతున్న వాడు, వింటున్న శ్రోత ఒక పరమానంద భరితమైన రసానుభూతికి గురవుతాడు.

**దేఖ్‌వో ఛత్ పె ఉతర్ ఆయీహై సావన్ కి ఘటా**

**దేరహీ హై ద్వార్ పె ఖడీ ఆవాజ్ పుర్‌వాయీ**

**బిజ్ లియాన్ రహరహ కె పహాడోంసె చమక్ ఉఠ్‌తీ హై**

**సూని ఆఖోమే కొయీఖ్వాబ్ జొ లే అంగ్‌డాయీ**

**కైసే సంఝావూ కె యే వక్త్ క మతలబ్ క్యాహై.**

**దిల్ కి హై బాత్ న హోఠోం సె కహీ జాయేగీ.**

ఒక్కొక్క పదం ఎంత అద్భుతమైన భావనను కలుగచేస్తూ, దృశ్యాన్ని కళ్ల ముందు నిలుపుతూంటే, అత్యంత దృశ్యాత్మకమైన కవిత ఇది అనిపిస్తుంది.

ఇంటి కప్పు పైకి వర్షపు మేఘం దిగి వచ్చిందట. గాలి ఇంటి తలుపు తడుతూ పిలుస్తోందట. ఉండి ఉండి పర్వతాలపై మెరుపులు మెరుస్తున్నాయట. నిరాశ నిండిన కళ్లల్లో ఏదో కోరిక రెక్కలు విప్పుకుంటోందట. ఇది హృదయానికి చెందిన భావన. ఈ భావనను ఎలా వివరించాలి? హృదయంలోని భావన పెదవులతో చెప్పకూడదు అంటున్నాడు కవి. అత్యద్భుతపు సున్నితమైన శృంగార భావనపై తెరతీస్తుందీ చరణం.నాయిక కోసం ఎదురుచూస్తున్నాడు నాయకుడు. ఆమె వస్తుందో రాదో తెలియదు. కానీ ప్రకృతిలో చెలరేగుతున్నా ఈ సంచలనం ఆమె రాకను సూచిస్తోందని నిరాశ చెందిన నాయకుడి కళ్ళల్లో కోర్కెలు రెక్కలు విప్పుకుంటున్నాయన్నమాట.

ఈ వాతావరణంలో, ఈ రాత్రి, ఈ వర్షంలో నాయిక కోసం ఎదురు చూస్తున్న నాయకుడు తన మనసులో కలిగిన భావనను మనసుతోనే అర్థం చేసుకోమంటున్నాడు. ఆ రాత్రి ఆమె లేకపోతే తనకు నిద్ర రాదంటున్నాడు.

**యే భటక్తే హువె జుగ్ను యే దియే అవారా**

**భిగాతే పేడ్ పె బుర్ఘ్ బుర్ఘ్ కె చమక్ ఉఠ త్ హై**

**తేర అచల్ మె టకే సల్మె సితారే జైసే**

**ముఝ్సె మిల్నే కొ బినా బాత్ దమక్ ఉఠ్తీహై**

సారా అలం హై గిరఫ్తార్ తెరె హుస్న్ మె జబ్

ముఝు సే హీ కైసె యె బర్సాత్ సహీ జాయేగీ..

ఆ రాత్రి అటూ ఇటూ ఎగిరే మిణుగురు పురుగులు, ఆవారా దీపాల్లాగ(కదిలే దీపాలు) ఉన్నాయట. అవి తడిసిన చెట్టు శాఖలలో ఆరి, వెలుగుతూ, ఆమె కొంగుపై నిండిన తారకల్లాగా ఉన్నాయట. తనని కలవకుండా ఆ రాత్రికి సార్ధకత లేదని చెప్తున్నట్టున్నాయట. మొత్తం రాత్రి ఆమె అందానికి బందీ అయినప్పుడు తాను మాత్రం ఎలా ఈ వర్షాన్ని ఆమె లేకుండా భరించగలడు?

రాత్ రానీ కి యె నషీలీ భీనీసి ఖుష్బూ

ఆరహీ హైజొ ఛన్ ఛన్‌కె ఘనీ డాలోంసే

ఐస లగ్తా హై కొయి ధీత్ చకోరే సె లిపట్

ఖేల్ అయీ హై తెరే ఉల్ఝెహువే బాలోంసె,

ఔర్ బేజాన్ నకర్ మెరే తడప్తే హువే దిల్కో

ఐసీ రంగీన్ గజల్ అకె న ఫిర్ జాయేగీ..

నైట్ క్వీన్ పరిమళం, ఆమె కురులతో ఆడుకుని వచ్చినట్టుందట. ఇంకా తనని ఏడ్పించకుండా రమ్మంటున్నాడు. ఇంత గొప్పగా వచ్చిన గజల్ తిరిగి వెళ్లదంటున్నాడు. ఈ పాదాలలో వున్న ప్రతీకలు, పొదిగిన భావాలు ఒక్క వాక్యంలో చెప్పటం కుదరదు.

నిజానికి దీన్ని సినిమా పాట అనేకన్నా గొప్ప 'కవిత' అనవచ్చు. అయితే, కవితలను అందమైన సినీగేయాలుగా మలచటం రోషన్‌కు వెన్నతో పెట్టిన విద్య. హిందీ సినీ సంగీత ప్రపంచంలో కవితలను గేయాలుగా మలచటంలో రోషన్, మదన్ మోహన్, ఖయ్యాంలు దిట్టలు. అందుకే 'నయీ ఉమర్ కీ నయీ ఫసల్' సినిమాకు పాటలు రచించటంలో నీరజ్ పెద్ద కష్టపడలేదు. ఎలాంటి చేదు అనుభవాలను ఎదుర్కోవాల్సిన అవసరం రాలేదు.

నీరజ్ పాటలు విన్న సినీ ప్రపంచం ఉలిక్కిపడింది. ఎందుకంటే నీరజ్ పాటలతో సాహిర్ ఆదర్శం, శైలేంద్ర తాత్వికతలతో పాటూ విలక్షణమైన నాజూకుతనం ఉంది. దానిపై అత్యంత ఉన్నతమైన భావాలు, ఉత్తమమైన సాహిత్యం. ఇదే సమయానికి శైలేంద్ర మరణించాడు. సాహిర్ మొండితనం, అహంకారాలకు తలవంచిన వారితో తప్ప సాహిర్ పనిచేయడు. దాంతో నీరజ్‌కు వరుసగా సినీగీతాల రచనకు అవకాశాలు రాసాగాయి. ముఖ్యంగా ఆనాటి నెంబర్ వన్ సంగీత దర్శకద్వయం శంకర్ జై కిషన్‌ల నుండి పిలుపు రావటంతో కళ్లు మూసి తెరిచేలోగా నీరజ్ అగ్రశ్రేణి గేయ రచయిత అయిపోయాడు. శంకర్ జై కిషన్‌లు అధికంగా శైలేంద్ర, హస్రత్ జైపురిలతో కలసి పనిచేశారు. శైలేంద్ర మరణంతో పెద్దలోటు ఏర్పడింది. ఆలోటును పూడ్చేందుకు వారు పలు గేయ రచయితలను వాడుతూంటే నీరజ్ పరిచయమయ్యాడు. 'కన్యాదాన్' సినిమాతో నీరజ్ శంకర్ జైకిషన్‌ల సామ్రాజ్యంలో అడుగుపెట్టాడు. నీరజ్ కవితలు గమనిస్తే, ఆయన రచించిన గేయాలు గమనిస్తే ఆయన పల్లవికీ చరణానికీ పెద్ద తేడా చూపడు. అధికమైన పంక్తులతో పల్లవిని రచిస్తాడు. శంకర్ జై కిషన్‌లు అతి చిన్న పల్లవులతో పాటలను సృజిస్తారు. వారు ముందు బాణీని సృజిస్తారు. గేయ రచయిత ఆ బాణీకి తగ్గటు పదాలతో పాట రాయాలి.

ఆవారా హూ

యా గర్ దిశమేహో ఆస్మాన్ కా తారా హూ

(ఆవారా)

యెతో కహో కౌన్ హో తుం

ముఝ్ సె పూఛే బినా దిల్‌మె ఆనేలగీ (ఆషిక్)

**తేరా మేరా ప్యార్ అమర్,**

**ఫిర్ క్యూ ముఝ్ కో లగ్తా హై డర్**

**మేరే జీవన్ సాథీ బతా**

**క్యూ దిల్ ధడకే రహరహకర్ (అస్లీ – నక్లీ)**

ఇలా గమనిస్తే చిన్న చిన్న పదాలు, చిన్న చిన్న పల్లవులు, ఆకర్షణీయమైన బాణీ మైమరపించే ఆర్కెస్ట్రేషన్ శంకర్ జైకిషన్ అత్యద్భుతమైన విజయానికి కారణాలు. వారికి రచయితకు స్వేచ్ఛ నివ్వటంపై విశ్వాసం లేదు. స్వేచ్ఛనిస్తే పాట అటక ఎక్కుతుందని వారి నమ్మకం. కాబట్టి ముందుగా బాణీని సృజించి బాణీ బంధనాలలో రచయితను బిగిస్తారు. ఇది నీరజ్‌కు అలవాటు లేదు. అందుకే శంకర్ జైకిషన్ వద్దకు నీరజ్ ఓ కవితాత్మకమైన పాటను తీసుకువెళ్లాడు.

**లిఖే జో ఖత్  తుఝే**

**వో తేరీ యాద్ మే**

**హజారో రంగ్ కె నాజారే బన్‌గయే**

**సవేరాజబ్ హువా తో ఫూల్ బన్ గయె**

**జో రాత్ ఆయెతో సితారె బన్‌గయే**

శంకర్ జై కిషన్ గీతాలకు రచన ఇలా ఉండదు. కానీ ఈ కవితకు అత్యద్భుతమైన బాణీని కట్టి పాటను సూపర్ హిట్ చేశారు శంకర్ జైకిషన్‌లు. కానీ శంకర్ జై కిషన్‌లతో ఎన్ని హిట్ పాటలను సృజించినా నీరజ్ వారి వద్ద స్వేచ్ఛగా ఉండలేకపోయాడు. కారణం నీరజ్ సృజనను వారు బాణీతో బంధించటమే. పైగా, వారు నీరజ్‌లో శైలేంద్రను చూడాలని ప్రయత్నించటంకూడా నీరజ్‌ను ఇబ్బందికి గురిచేసిన అంశం. నిజానికి నీరజ్ రచనా శైలిలోనే శైలేంద్రలా మాములు సందర్భాలలోనూ అనేక సార్వజనీన భావాలు, ఆధ్యాత్మకపుటాలోచనలు ప్రదర్శించటం ఉంది.కానీ స్వేఛ అలవాటయిన పక్షికి ఎంత ఎగరటం అలవాటే అయినా బంధనాలలో అది ఎగరలేదు. శంకర్ జైకిషన్ ల వద్ద నీరజ్ ది అలాంటి పరిస్థితి.

**కహతాహై జోకర్ సారా జమానా**

**ఆధీ హకీకత్  ఆధా ఫసానా**

**చష్మే  ఉతారో, ఫిర్ దేఖోయారో**

**దునియా నయీ హై చెహరా పురానా.**

మేరానాం జోకర్‌లోని  ఈ పాటలో నీరజ్, శైలేంద్రలా ప్రపంచం సగం నిజం సగం అబద్ధం, కళ్లు తెరచి చూస్తే ప్రపంచం కొత్తది కానీ, దాని ముఖం పాతది అని తెలుస్తుంది.అంటాడు. పాట హిట్ అయింది. కానీ, శైలేంద్ర ఎలా పాటలో పాత్ర స్వభావాన్ని సందర్భోచితంగా చెప్తూ, నాయకుడి ఇమేజ్ ను అనుసరిస్తూ, సినిమా సారాన్ని గీతంలో ప్రదర్శిస్తూ, సార్వజనీన భావాలను పొదుగుతాడో అది లోపించింది. అందుకే, పాట హిట్ అయినా, నీరజ్ కు సంతృప్తి లేదు. శంకర్ జైకిషన్ లకు ఆనందమూ కలగలేదు.

**ఈ పాటలో చరణంలో అంటాడు..**

**ధక్కే  పె ధక్కా, రేలే పె రేలా**

**హై భీడ్ ఇతనీ పర్ దిల్ అకేలా**

ఎటు చూసినా మనుషుల ప్రవాహమే. ఇంతమంది మనుషులున్నా హృదయం మాత్రం ఒంటరిదే.

ఇలాంటి విశ్వజనీన సత్యాలు మనసుకు హత్తుకునే రీతిలో ప్రదర్శించాడు నీరజ్.

**'ఏయ్ భాయ్, జర దేఖ్ కె చలో'**

ఈ పాట నీరజ్‌కు ఎంతో పేరు సంపాదించి పెట్టింది. ఈ పాటలోనూ అనేక జీవిత సత్యాలను అలవోకగా చెప్తాడు నీరజ్ ఇది కూడా మామూలుశంకర్ జైకిషన్ ల పాటకు భిన్నమయిన పాట...పూర్తిగా నీరజ్ కవిత పద్ధతిలో వుంటుంది....

**బస్ యహీ అపరాధ్ మై హర్ బార్ కర్తాహూ**

**ఆద్మీ హు ఆద్మిసే ప్యార్ కర్తాహూ..**

'పహెచాన్' సినిమాలోని ఈ పాటలో సైతం సార్వజనీన భావాలు ఎదకు హత్తుకునే రీతిలో ప్రదర్శిస్తాడు.

**ఎక్‌ఖిలోనా బన్‌గయా,దునియా కే మేలేమే**

**కోయి ఖేలే భీడ్‌మే కోయి అకేలేమే**

ఈ ప్రపంచంలో ఒక బొమ్మనయిపోయాను. కొందరు బహిరంగంగా ఆడుకుంటే కొందరు ఒంటరిగా (వ్యక్తిగత స్థాయిలో) ఆడుకుంటారు. ఈ పాదాల అర్ధం గురించి బోలెడెంత చర్చించవచ్చు. అయితే శంకర్ జై కిషన్ సంగీత దర్శకత్వంలో ఇలాంటి భావాలు కానీ, కవితాత్మకమైన గేయాలు కానీ రచించే అవకాశం నీరజ్‌కు తక్కువగా లభించింది.

**సన్‌డేకో ప్యార్ హువా, మన్‌డే ఇక్ రార్ హువా (కన్యాదాన్)**

ఆదివారం ప్రేమ మొదలయింది. సోమవారం ఆమోదం అభించింది.

**హార్‌గయె హార్ గయే**

**అరె తో హై బుద్ధుబ్రహ్మచారి**

**(ఏక్‌నారి, ఏక్ బ్రహ్మచారి)**

**ఆప్ యహ ఆయె కిస్‌లియే**

**ఆప్నే బులాయె ఇస్‌లియే**

**(కల్ ఆజ్ ఔర్ కల్)**

ఇలాంటి తేలిక పాటలు అధికంగా రాయాల్సి వచ్చింది. అక్కడకూడా కాల్ క పయ్యా ఘోమే భయ్యా(చందా ఔర్ బిజ్లీ) సూనీ సూనీ సాస్ కి సితార్ పర్ (లాల్ పథ్థర్) వంటి పాటలు రచించినా నీరజ్‌లోని కవి కన్నా బాణీకి తగ్గ పదాలు కూర్చే 'మేస్త్రి' అధికంగా కనబడ్డాడు. అందుకే శంకర్ జై కిషన్‌తో అధికంగా హిట్ పాటలు సృజించినా వారి గురించి ఎక్కువగా ప్రస్తావించడు నీరజ్.

ఇక్బాల్ ఖురేషీ సంగీత దర్శకత్వంలో 'చ చ చ' సినిమాకు కొన్ని అత్యద్భుతమైన గేయాలు రచించాడు నీరజ్.

**సుబహోన అయి, షాం న ఆయి**

**జిస్ దిన్ తేరీ యాద్ న ఆయీ,**

**యాద్ న ఆయీ,**

అయితే ఈ సినిమాలోనే వో హం నథీ, వో తుం నథీ, వో రహెగుజర్ థి ప్యార్ కీ, లుటీ జహా పె బేవజా , పాల్కీ, బహార్ కీ' సాహిత్య పరంగా, భావం పరంగానూ పరమాద్భుతమైన పాట. ఈ పాటను కూడా గొప్ప కవితలా భావించవచ్చు. ఈ పాటలో నాయికలేని తన జీవితాన్ని నాయకుడు 'బినాతుమ్హారి జిందగీ, షమా హై ఎక్ మజార్ కీ' అంటాడు. అంటే 'ఆమె లేని జీవితం, సమాధి వద్ద ఉంచిన దీపం'

లాంటిదన్నమాట. ఇలాంటి అత్యద్భుతమైన భావాలతో గీతాలు రాశాడు. కానీ నీరజ్ ఏనాడూ బొంబాయి సినీ ప్రపంచంలో ఇమడలేదు. ఒదగలేదు. అందుకే పాటలు రాయాల్సి వచ్చినప్పుడు బొంబాయి వచ్చేవాడు. పనయిపోగానే అలీఘడ్ వెళ్లిపోయాడు. దాంతో సినీగేయ రచనపట్ల నీరజ్‌కు నిబద్ధత లేదని భావించారు చాలామంది. ఇలాంటి పరిస్థితులలో నీరజ్‌కు దేవ్ ఆనంద్ నుంచి పిలుపు వచ్చింది. కొన్ని మరుపురాని మధురగీతాల సృజనకు రంగం సిద్ధమయింది. దేవ్ ఆనంద్ సినిమాల సంగీత దర్శకత్వం అధికంగా ఎస్డీ బర్మన్ నిర్వహించేవాడు. ఎస్డీ బర్మన్‌కు ఆర్కెస్ట్రేషన్ పై పెద్ద నమ్మకం లేదు. అతనికి సినిమా పాటలో 'పల్లవి' బాగా కుదరాలి. మంచి సాహిత్యం ఉండాలి. అందుకే ఎస్డీ బర్మన్ సాహిర్, మజ్రూహ్, శైలేంద్ర వంటి వారితో సులభంగా, సుఖంగా పనిచేశాడు. చక్కని పాటలను సృజించాడు. ఎస్డీ బర్మన్ అధికశాతం గేయం ఆధారంగా బాణీని సృజిస్తాడు. అంటే, అతని సృజనలో గేయ రచనకు ప్రాధాన్యం అధికం అన్నమాట. స్వయంగా రవీంద్రనాథ్ ఠాగోర్ రచనల పట్ల మక్కువ ఉన్నవాడు. దాంతో తన కవిత విశ్వరూపం ప్రదర్శించే అవకాశం నీరజ్‌కు లభించింది. లభించిన అవకాశాన్ని నీరజ్ సద్వినియోగపరచుకున్నాడు. సినీ సంగీత చరిత్రలో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్నాడు.

*(మరిన్ని నీరజ్ పాటలతో వచ్చే నెల)*

Post your comments